సాక్షి
మహబూబ్‌నగర్
శుక్రవారం ၊ 16 ၊ ఫిబ్రవరి ၊ 2024



ఊరంతా పండగ

చెన్నకేశవస్వామి జాతర నేపథ్యంలో గంగాపూర్‌లోని ప్రతి ఇంట్లో సందడి నెలకొంది.

వివరాలు 8లో ▸



నేడు రథసప్తమి

అలంపూర్ సూర్యనారాయణ ఆలయంలో శుక్రవారం రథసప్తమి నిర్వహించనున్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.6 /17.3

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ వేడిమి.. ఉదయం, రాత్రి వేళల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గంగాపురం జాతరకు ప్రత్యేక బస్సులు

స్టేషన్ మహబూబ్‌నగర్: గంగాపురం లక్ష్మీచెన్న కేశవస్వామి జాతరకు మహబూబ్‌నగర్ డిపో నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సుజాత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి ప్రత్యేక బస్సులు గంగాపురం వరకు నడుపుతామని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

18న ఎస్టీ గురుకుల సీఓఈసెట్ పరీక్ష

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎస్టీ గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాల కోసం ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తిరుమలహిల్స్‌లో ఉన్న ఎస్టీ గురుకులాల ప్రిన్సిపాల్ సంగీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 384 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారన్నారు. పరీక్షలకు హాజరయ్యేవారు ఉదయం 8 గంటలకే కేంద్రానికి చేరుకోవాలని, హాల్‌టికెట్, ప్యాడ్, పెన్నుతో రావాలని సూచించారు.

ప్రజాపాలనలో భాగస్వాములమవుదాం



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రజా పాలనలో భాగస్వాములమవుదామని జెడ్పీసీఈఓ రాఘవేంద్రరావు అన్నారు. నూతనంగా జెడ్పీ సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను శుక్రవారం చాంబర్‌లో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. అనుమతి లేకుండా సెలవుపై వెళ్లేందుకు వీలు లేదన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తెస్తే పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శేఖర్, నాయకులు రాము, వీరేష్, ఇస్మాయిల్, వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రీప్రైమరీ టీచర్స్ ట్రైనింగ్ కోర్సుకు దరఖాస్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ శిక్షణ, ఉపాధి- ప్లేస్‌మెంట్ కార్యక్రమం పథకం కింద సిటీ అకాడమీ మహబూబ్‌నగర్ ద్వారా ప్రీప్రైమరీ టీచర్స్ ట్రైనింగ్ కోర్సుకు నిరుద్యోగ మైనార్టీ యువత నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి రవీంద్రనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో 30 సీట్లు ఉంటాయని, ఇంటర్ ఆపై విద్యార్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వయస్సు 18–44 ఏళ్లలోపు ఉండాలని, గ్రామీణ ప్రాంతాల వారి వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతం వారి రూ.2 లక్షల కంటే తక్కువ ఉండాలన్నారు. ప్రభుత్వం నుంచి లేదా ప్రభుత్వరంగ సంస్థ ద్వారా ఇంతకు ముందు ఈ కోర్సులో శిక్షణ పొందినవారు అనర్హులన్నారు. కోర్సులో శిక్షణ పొందేందుకు ఆసక్తి గలవారు దరఖాస్తులను ఐడీఓసీ బిల్డింగ్‌లోని జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో ఈ నెల 21లోగా అందజేయాలని, పూర్తి వివరాల కోసం జమీల్ సెల్ నం.94405 69457ను సంప్రదించాలని ఆయన కోరారు.

నూతన డీటీసీగా సీహెచ్ శివలింగయ్య




పాలమూరు: జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీసీ)గా సీహెచ్ శివలింగయ్య గురువారం బాధ్యతలు తీసుకున్నారు. డీటీసీ శివలింగయ్య సంగారెడ్డి నుంచి బదిలీపై జిల్లాకు వచ్చారు. అలాగే ఇక్కడ డీటీసీగా పనిచేస్తున్న దుర్గాప్రమీల నిజామాబాద్‌కు బదిలీ అయ్యారు. ఈమె దాదాపు మూడేళ్లుగా జిల్లాలో పనిచేశారు. కొత్తగా బాధ్యతలు తీసుకున్న డీటీసీ సీహెచ్ శివలింగయ్యను ఎంవీఐ నరేష్, ఏఓ ఇతర సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎస్‌బీ సీఐగా శివకుమార్

మహబూబ్‌నగర్ క్రైం: మహబూబ్‌నగర్ డీఎస్‌బీ సీఐగా ఎస్‌జే శివకుమార్‌ను నియమిస్తూ మల్టీ జోన్–2 ఐజీ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు శివకుమార్ ఐజీ కార్యాలయం నుంచి జిల్లాకు రానున్నారు. అలాగే నారాయణపేట ఎస్‌బీ అటాచ్‌మెంట్‌లో ఉన్న శ్రీకాంత్‌రెడ్డి హైదరాబాద్ మల్టీజోన్–2 ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రాజెక్టులకు ఊతం



నార్లాపూర్ వద్ద పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పంప్

ఉమ్మడి జిల్లాకు రూ.2వేల కోట్లు కేటాయింపు

- ఇకపై ఊపందుకోనున్న ఎత్తిపోతల పనులు
- జలయజ్ఞం ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/గద్వాల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటు ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు అధిక మొత్తంలో నిధులు కేటాయించారు. దీంతో ఇన్నాళ్లుగా ఆగుతూ.. సాగుతున్న ఆయా ప్రాజెక్టుల పనులు ఊపందుకోనున్నాయి. ప్రధానంగా పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జలయజ్ఞం కింద చేపట్టిన పలు ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ నిధులు వెచ్చించారు. ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులకు మొత్తం రూ.2 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించగా.. ఇందులో పాలమూరు- రంగారెడ్డి, కల్వకుర్తి ప్రాజెక్టులకు రూ.1,800 కోట్లు, నడిగడ్డ జిల్లాలోని జూరాల, నెట్టెంపాడు, గట్టు, తుమ్మిళ్ల ప్రాజెక్టులకు రూ.200 కోట్లు కేటాయించారు. దీంతో నిధుల కోసం ఎదురుచూస్తున్న పనులకు ఊతమిచ్చినట్లయింది. ఇటీవల రూ.2,945 కోట్లతో పరిపాలన అనుమతి లభించిన పేట- కొడంగల్ ఎత్తిపోతల పనులకు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు.

■ సుమారు 58 శాతం పనులు పూర్తయిన పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.1,400 కోట్ల నిధులు కేటాయించింది. ఈ నిధులతో ప్రధానంగా భూముల పరిహారం చెల్లింపులతో పాటు ఇప్పటికే పూర్తయిన పెండింగ్ బిల్లులు, అదేవిధంగా ప్రధాన పనులైన స్ట్రక్చర్స్, కాల్వ పనులు చేపట్టనున్నారు.

■ జలయజ్ఞం కింద ఉమ్మడి జిల్లాలో 4.36 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు చేపట్టిన కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తూ రూ.400 కోట్ల నిధులు వెచ్చించింది. ఈ నిధులతో ప్రాజెక్టు పనులు పూర్తి చేసి దాని కింద నిర్దేశించిన పూర్తిస్థాయి ఆయకట్టు లక్ష్యానికి సాగునీరు పారించేందుకు అధికారులు చర్యలు చేపట్టనున్నారు. రూ.400 కోట్లలో రూ.100 కోట్ల వరకు భూ పరిహారం చెల్లింపులకు వెచ్చించనుండగా.. మిగిలిన రూ.300 కోట్లతో ప్రధాన కాల్వల నుంచి పంట పొలాలకు సాగునీటిని తీసుకెళ్లేందుకు అవసరమైన డిస్ట్రిబ్యూటరీ చానళ్లు, పిల్ల కాల్వలు, స్ట్రక్చర్ నిర్మాణ పనులు చేపట్టేలా అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఈ పనులు పూర్తి చేసి వచ్చే వానాకాలం నాటికి ప్రస్తుతం ఇస్తున్న 3.07లక్షల ఆయకట్టుకు అదనంగా మరో 85 వేల ఎకరాలను అందుబాటులోకి తీసుకొచ్చేలా పనులను వేగవంతం చేస్తున్నారు.

■ ఉమ్మడి గట్టు మండలంలోని గట్టు, కేటీదొడ్డి ప్రాంతాల్లోని 33 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.580 కోట్లతో చేపట్టిన గట్టు ఎత్తిపోతల పథకం పనులు సుమారు 30 శాతానికి పైగా పూర్తయ్యాయి. మిగిలిన పనులు పురోగతిలో ఉండగా.. ప్రాజెక్టుకు అవసరమైన ముంపునకు గురైన భూములకు రూ.20కోట్ల వరకు పరిహారం చెల్లించాల్సి ఉంది. అయితే కేటాయించిన నిధుల్లో మొదటి ప్రాధాన్యత కింద నెట్టెంపాడు ప్రాజెక్టును పూర్తిచేసేలా చర్యలు చేపట్టనున్నారు.

ఆర్డీఎస్‌కు సైతం..

ఆర్డీఎస్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం కింద మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మించనున్నారు. 1.02 టీఎంల సామర్థ్యంతో, 9 కిలోమీటర్ల మేర పైపులైన్, లింకు కెనాల్ వంటి పనులతో చేపట్టనున్న బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించేందుకు 563 ఎకరాల భూమి అవసరం. భూ సేకరణ పూర్తయితే రిజర్వాయర్ పనులు వేగిరం చేయవచ్చు. దీంతో ప్రభుత్వం ఈ రిజర్వాయర్ కోసం రూ.50 కోట్లు కేటాయించింది. వీటిలో అధిక మొత్తం నిధులు భూములకు పరిహారం చెల్లించి మిగతా వాటితో పనులు చేపడుతారు.


90 శాతం పూర్తి..

నడిగడ్డ ప్రాంతంలో జలయజ్ఞం కింద చేపట్టిన నెట్టెంపాడు ప్రాజెక్టుతో పాటు జూరాల, గట్టు ఎత్తిపోతలు, ఆర్డీఎస్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాలకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. 2005లో నడిగడ్డలోని 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన నెట్టెంపాడు 2013లో సుమారు 90 శాతం పనులు పూర్తి చేసుకుని దానికింద గుడ్డెందొడ్డి, ర్యాలంపాడు, తాటికుంట జలాశయాల కింద 1.48 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. మిగిలిపోయి అసంపూర్తిగా కొనసాగుతున్న పనులు నిధుల లేమితో పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం జలయజ్ఞం ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తూ నిధులు పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు రూ.135 కోట్లు విడుదల చేసింది. అదేవిధంగా ఉమ్మడి గట్టు మండలంలోని 33 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేలా చేపట్టిన గట్టు ఎత్తిపోతల పనులకు సైతం రూ.135 కోట్లనే వినియోగించుకునేలా కేటాయింపులు చేశారు. 90 శాతం పనులు పూర్తయిన నెట్టెంపాడులో ప్రధానంగా 98, 99, 100 ప్యాకేజీల కింద పనులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో ప్రధాన కాల్వకు అనుసంధానంగా నిర్మించాల్సిన పంట పొలాలకు వెళ్లే పిల్ల కాల్వలు, సైఫన్లు, గద్వాల- ధరూరు మధ్యలో బ్రిడ్జి నిర్మాణం, 98వ ప్యాకేజీ కింద ధరూరు, గద్వాల, ఇటిక్యాల మండలాల పరిధిలో వివిధ రకాల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అలాగే ఈ ప్రాజెక్టుల కింద ప్రధానంగా ఉన్న జలాశయాల నుంచి వాటి కిందున్న ఆయకట్టుకు నీరు అందించే ప్రధాన, పిల్ల కాల్వల నిర్మాణాలు సైతం పూర్తిచేయాల్సి ఉంది.

అధిక ప్రాధాన్యం..

ప్రస్తుత బడ్జెట్‌లో పాలమూరు- రంగారెడ్డి, కల్వకుర్తి ప్రాజెక్టులకు రూ.1,800 కోట్లు కేటాయించారు. ఇందులో పాలమూరు- రంగారెడ్డికి రూ.1,400 కోట్లు, కల్వకుర్తికి రూ.400 కోట్లు వెచ్చించారు. వీటిని ప్రాధాన్యత క్రమంలో వినియోగించి త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపడతాం.

– అహ్మద్‌ఖాన్, సీఈ, పీఆర్‌ఎల్‌ఐ



జూరాలకు రూ.13 కోట్లు

ఉమ్మడి పాలమూరు వరప్రదాయినిగా పేరుగాంచిన జూరాల ప్రాజెక్టు గేట్ల మరమ్మతు, గుర్రంగడ్డ వాక్‌వే బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.13 కోట్లు కేటాయించారు. ప్రధానంగా గత ప్రభుత్వ హయాంలో జూరాల గేట్ల మరమ్మతుకు నిధులు కేటాయించగా, మరికొన్ని అవసరం కావడంతో ప్రస్తుత ప్రభుత్వం వెచ్చించినట్లు తెలుస్తోంది. అలాగే గుర్రంగడ్డ వాక్‌వే బ్రిడ్జికి సైతం నిధుల్లో కొంత మేర వెచ్చించి పనులు మొదలు పెట్టేలా చర్యలు తీసుకోనున్నారు.

సేవాలాల్ జెండాతో గిరిజనుల అభివృద్ధి



మహాభోగ్ కార్యక్రమంలో కలెక్టర్ రవినాయక్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

- బంజారా సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలి
- జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: 'పది జెండాలు పట్టుకోకుండా.. సేవాలాల్ జెండా కిందకు వచ్చి గిరిజనుల అభివృద్ధికి కృషిచేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకొని గిరిజన సేవా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లాకేంద్రంలో వేడుకలు నిర్వహించారు. ముందుగా క్లాక్‌టవర్‌లో సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం సేవాలాల్ ఆలయం వరకు శోభాయాత్రగా బయలుదేరి మహాభోగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బంజారా సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించేలా కృషిచేయాలన్నారు. సేవాలాల్ ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం స్వేచ్ఛగా జీవించే అవకాశం కలిగిందన్నారు. హాస్టల్‌లో ఉండి చదువుకునే విద్యార్థులు ఇతర విషయాల గురించి ఆలోచించి తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోకుండా ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ స్వర్ణయుగం కానుందని, నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకొని రాబోయే రోజుల్లో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ సేవాలాల్ ఆశయాల సాధనకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, డీకే అరుణ, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, జిల్లా గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, నాయకులు రఘునాయక్, శేఖర్‌నాయక్, చంద్రానాయక్, తులసీరాం నాయక్, రమావత్ రవిరాథోడ్, రమేశ్‌నాయక్, కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

15 ఫైనాన్స్ నిధులు వినియోగించుకోండి

- రూ.2.38 కోట్లతో అభివృద్ధి ప్రణాళికకు తీర్మానం
- జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): అభివృద్ధి పనుల కోసం 15వ ఫైనాన్స్ నిధులను వినియోగించుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం జెడ్పీ హాల్‌లో చైర్‌పర్సన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అయితే అసెంబ్లీ సమావేశాలు ఉండటంతో జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యేలు హాజరుకాలేదు. దీంతో ఎలాంటి చర్చ లేకుండా కేవలం గంటలోపు సభను ముగించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ 15వ ఫైనాన్స్ నిధులు రూ.2.32 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాలని సభ తీర్మానించిందని చెప్పారు. పాఠశాలలు, ప్రభుత్వ సంస్థల్లో పారిశుద్ధ్య నిర్వహణ, అదనపు మౌలిక సదుపాయాలు కల్పన కోసం ప్రతిపాదనలతో రూపొందించిన జిల్లా అభివృద్ధి ప్రణాళికను ఆమె వివరించారు. దీంతోపాటు కొకుంట్ల మండలంలోని పీహెచ్‌సీ భవనానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.75 లక్షలు కేటాయించిన తీర్మానానికి సభ్యులు ఆమోదించినట్లు తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయని దీంతో ఎమ్మెల్యేలు సభకు హాజరుకాలేరని ఈ సమయంలో జెడ్పీ సభ పెట్టడం సరికాదని జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. దీంతో ఈ నెల 29న సభ నిర్వహిస్తామని, ఈ రోజు ఎజెండా అంశాలపై పూర్తిస్థాయిలో చర్చిస్తామని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జెడ్పీసీఈఓ రాఘవేందర్‌రావు, డిప్యూటీ సీఈఓ శర్మ, జెడ్పీటీసీ సభ్యులు కల్యాణి, రవీందర్‌రెడ్డి, వెంకటేశ్వరమ్మ, నిర్మల, సుధశ్రీ, మోహన్‌నాయక్, అన్వర్, సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'కట్టిన డబ్బులు వాపసు ఇవ్వండి'



రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఎండీ రాంచందర్‌కు కలిసి వినతిపత్రం అందజేస్తున్న శాంతన్నయాదవ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: గొర్రెల పంపిణీ పథకం కోసం గతంలో తాము చెల్లించిన వాటా ధనం వెనక్కి ఇవ్వాలని జిల్లా గొర్రెలకాపరుల సహకార సంఘం అధ్యక్షుడు శాంతన్నయాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మేనేజింగ్ డైరెక్టర్ రాంచందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని 16,020 మంది రెండో విడత పథకానికి ఒక్కొక్కరు రూ.43,750 చొప్పున డీడీలు చెల్లించారన్నారు. అందులో శాసనసభ ఎన్నికలకు ముందు కేవలం 1,377మందికి మాత్రమే యూనిట్లు పంపిణీ చేశారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఈ పథకానికి సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇప్పటికే తమ వాటా కింద చెల్లించిన సుమారు రూ.75 కోట్లను బ్యాంకు ఖాతాలలో జమ చేయాలని కోరారు. అప్పట్లో లబ్ధిదారులు ఈ పథకం కోసం అప్పులు చేశారని, వడ్డీలు కట్టే పరిస్థితుల్లో లేరన్నారు. దీనికి స్పందించిన ఎండీ త్వరలోనే డబ్బులు వాపసు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా గొర్రెలకాపరుల సహకార సంఘం ఉపాధ్యక్షురాలు బాలమణి, డైరెక్టర్లు ఎస్.రాజగోపాల్‌యాదవ్, బి.లక్ష్మణ్, మహేశ్వరి, సాయిలుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఈ-చలాన్ గడువు

మహబూబ్‌నగర్ క్రైం: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ ఈ- చలాన్స్‌పై ప్రకటించిన రాయితీ గడువులు గురువారంతో ముగిశాయి. గతేడాది డిసెంబర్ చివరి వారం నుంచి ఈ- చలాన్స్‌పై ప్రభుత్వం రాయితీ ఇవ్వడంతో వాహనదారులకు వెసులుబాటు కల్పించినట్లు అయ్యింది. దీంతో పోలీస్ శాఖ జిల్లావ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఈ-చలాన్స్ కట్టించే విధంగా కృషిచేశారు. ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా 2,61,316 కేసులలో రూ.3,10,97,225 నగదు ప్రభుత్వ ఖాతాలో జమ కావడం జరిగింది. ఇంకా జిల్లాలో 23,933 కేసులు పెండింగ్‌లో ఉండగా వీటి నుంచి రూ.1,19,21,140 వసూలు కావాల్సి ఉంది.

అయోధ్యకు పాలమూరు భక్తులు

- త్వరలో మరో రెండు రైళ్ల ఏర్పాటుకు కృషి : డీకే అరుణ



అయోధ్య వెళ్తున్న రైలు వద్ద బీజేపీ నేతలు

పాలమూరు: అయోధ్య దర్శనం కోసం జిల్లా నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆస్తా స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలును గురువారం బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ రామరాజ్య స్థాపనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్ నుంచి 1,400 మంది అయోధ్య రామ మందిరం దర్శనం కోసం వెళ్లడం సంతోషంగా ఉందన్నారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణంతో దేశంలోని కోట్లాది మంది రామభక్తుల కల నెరవేరిందన్నారు. కేంద్ర పెద్దలతో మాట్లాడి మరో రెండు రైళ్లు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. అనంతరం శాంతకుమార్ మాట్లాడుతూ అయోధ్యలో రామమందిరం నిర్మాణంతో హిందువుల కల సాకారమైందన్నారు. పాలమూరు ప్రజలు రామ మందిరం దర్శనం కోసం భారీగా తరలివెళ్లాలన్నారు. రాముడి దర్శనం కోసం వెళ్లే భక్తుల కోసం కేంద్ర ప్రభుత్వం దేశంలో వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక రైలు సౌకర్యం కల్పించిందన్నారు. అనంతరం భక్తుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అన్నదాన ప్యాకెట్లను డీకే అరుణ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, ఏపీ మిథున్‌రెడ్డి, బాలాత్రిపుర సుందరి తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ఇంటర్ ఇంగ్లిష్ ప్రాక్టికల్స్



ప్రైవేటు కళాశాలలో పరీక్ష సరళిని పరిశీలిస్తున్న డీఐఈఓ శ్రీధర్ సుమన్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా పలు కళాశాలల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం నుంచి ఇంగ్లిష్ ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్స్‌లో జనరల్ కోర్సుల వారికి 20 మార్కులు, ఒకేషనల్ విద్యార్థులకు 10 మార్కులు కేటాయిస్తారు. విద్యార్థులకు ఇంగ్లిష్‌పై ఉన్న అవగాహన తెలుసుకునేందుకు ఈ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 43 కేంద్రాల్లో 10,973 మంది విద్యార్థులు పరీక్ష రాయనుండగా.. ఉదయం 9 గంటలకు ప్రారంభం కానుంది.

ముగిసిన సైన్స్ ప్రాక్టికల్స్

జిల్లాలో 15 రోజులపాటు జరిగిన సైన్స్ ప్రాక్టికల్స్ గురువారం ముగిశాయి. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని పలు కేంద్రాలను డీఐఈఓ శ్రీధర్‌సుమన్ తనిఖీ చేశారు. పరీక్షలకు సంబంధించిన రిపోర్టులను డీఐఈఓ కార్యాలయంలో సమర్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. శుక్రవారం జరగనున్న ఇంగ్లిష్ ప్రాక్టికల్స్, 17న హ్యూమన్ వాల్యూస్, 19న ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ పరీక్షలను బోర్డు నిబంధనల ప్రకారం నిర్వహించాలని యాజమాన్యాలకు సూచించారు.

సీఎంఆర్ బియ్యం పూర్తిచేయాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: రబీ సీజన్ 2022–23కు సంబంధించి సీఎంఆర్ బియ్యం డెలివరీ పూర్తిచేయాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులు, మిల్లర్లతో సమీక్షించారు. ఇప్పటి వరకు కస్టమ్ మిల్లింగ్ రైస్ రబీ సీజన్‌కు సంబంధించి 24 శాతం మాత్రమే మిల్లర్లు ఎఫ్‌సీఐకి అప్పగించారని, మిగిలిన 76 శాతం ఈనెల 29 లోగా అప్పగించాలని ఆదేశించారు. ప్రస్తుతం మిల్లర్లు అందుబాటులో ఉన్న గన్నీ బ్యాగులను భద్రపరుచుకోవాలని సూచించారు. ప్రతిరోజు నిర్ణయించిన లక్ష్యం మేరకు 1,240 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి చేరవేయాలన్నారు. మిల్లర్లు, అధికారులు సమన్వయంతో ఈ ప్రక్రియ పూర్తిచేయాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, డీసీఎస్ఓ కె.శ్రీనివాస్, డీఎం ప్రవీణ్, ఎఫ్‌సీఐ మేనేజర్ అనిత్, మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉదండాపూర్ నిర్వాసితులను ఆదుకోవాలి: జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

- వివరాలు 8లో..



క్లుప్తంగా

బైక్ అదుపు తప్పి నెల్లూరి వాసి మృతి

బాలానగర్: బైక్ అదుపుతప్పి కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కేతిరెడ్డి పల్లిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ తిరుపాజీ తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూర్ జిల్లా పాములు మండలం వెదడచెర్వుకు చెందిన వెంగయ్య (42) రాజాపూర్ మండలంలోని ఈద్గాన్‌పల్లి వద్ద కుటుంబసభ్యులతో కలిసి కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం బాలానగర్ మండల కేంద్రానికి సరుకులు తీసుకునేందుకు వచ్చి.. తిరిగి వెళ్లే క్రమంలో కేతిరెడ్డిపల్లి శివారులోని రైతువేదిక వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. ఆయనకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మధ్యలోనే మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఝార్ఖండ్ యువకుడు..

గోపాల్‌పేట: విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన ఘటన రేవల్లి మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ తిరుపతిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన హీరాలాల్ తూరి (28) హెవీలైన్ కాంట్రాక్ట్ లేబర్‌గా పనులు చేసేందుకు రేవల్లికి వచ్చాడు. బుధవారం సాయంత్రం స్తంభం పైన పనులు చేస్తూ ఇండక్షన్ జోన్‌లోకి వెళ్లడంతో షాక్‌కు గురై కిందపడి మరణించాడు. గురువారం మృతుడి తమ్ముడు కరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకుని యువకుడు బలవన్మరణం

మక్తల్: ఉరేసుకుని యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని పంచదేవ్‌పాడులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మ్యాకలి రాజు(29)కు కృష్ణ మండలం గుడేబల్లూర్ చెందిన జ్యోతితో 8 ఏళ్ల క్రితం వివాహమైంది. భార్యాభర్తలు తరుచూ గొడవ పడుతుండడంతో పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి నచ్చజెప్పారు. తిరిగి గొడవ పడి 13న రాజు ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. బుధవారం రాజు బుధవారం తమ గ్రామానికి చేరుకుని భీమా కాల్వ వద్ద ఉరేసుకున్నాడు. చుట్టుపక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. గురువారం మృతుడి తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వేపీ లక్ష్మారెడ్డి తెలిపారు.

పోలీసుల అదుపులో దొంగల ముఠా?

దేవరకద్ర: కొంత కాలంగా నియోజకవర్గ కేంద్రంలోని బీసీ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటూ ఆటోలో గ్రామాలను తిరుగుతున్న దొంగల ముఠాగా అనుమానిస్తున్న వారిని నాగర్‌కర్నూల్ పోలీసులు బుధవారం రాత్రి అదుపులోకి తీసుకుని ఇక్కడి నుంచి తరలించారు. స్థానికుల కథనం ప్రకారం.. ఆరు నెలలుగా పట్టణంలోని బీసీ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని రెండు కుటుంబాలు తమ పిల్లలతో నివసిస్తున్నారు. నిత్యం వారు ఆటోలో డోర్ మ్యాట్‌లను తీసుకుని రోజంతా విక్రయించి తిరిగి ఇంటికి వచ్చేవారు. అయితే వారు దొంగల ముఠాకు చెందిన వారనే విషయం బుధవారం రాత్రి నాగర్‌కర్నూల్ పోలీసులు పట్టుకునే వరకు తెలియరాలేదు. ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలతో పాటు పిల్లలు ఉన్నట్లు తెలిసింది. నాగర్‌కర్నూల్‌లో దొంగతనాలకు పాల్పడిన ముఠాగా పోలీసులు అనుమానిస్తు విచారణ నిమిత్తం తరలించినట్లు సమాచారం. వారితో కొన్ని వస్తువులు రికవరీ చేసినట్లు స్థానికుల ద్వారా తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

దేవాలయంలో చోరీకి యత్నం

కొత్తకోట రూరల్: పట్టణ సమీపంలో గల వెంకటగిరి ఆలయంలో బుధవారం రాత్రి చోరీకి యత్నించారు. ఆలయంలోని ఇనుప తలుపుల గేటు విరగ్గొట్టి ఆలయంలోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి హుండీ కిందపడేశారు. గురువారం ఉదయం ఆలయం శుభ్రం చేసేందుకు వచ్చిన వ్యక్తి చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ కుర్మయ్యగౌడ్ ఆలయానికి చేరుకుని పరిశీలించారు. వనపర్తి నుంచి క్లూస్ టీంను పిలిపించి వేలిముద్రలను సేకరించారు. హుండీ తాళాలు బద్దలు కొట్టేందుకు ప్రయత్నించగా రాకపోవడంతో హుండీని కింద పడేశారు. అదేవిధంగా గర్భగుడిలోకి ప్రవేశించేందుకు కూడా ప్రయత్నించగా ఇనుప జాలీలు గట్టిగా ఉండటంతో వదిలేశారు. ఆలయంలో ఎలాంటి వస్తువులు చోరీకి గురికాలేదని, హుండీ తాళాలు రాకపోవడంతో డబ్బులు అలాగే ఉన్నాయని ఎస్‌ఐ తెలిపారు.



నేడు రథసప్తమి వేడుకలు



అలంపూర్‌లోని సూర్యనారాయణస్వామి ఆలయం

జోగుళాంబ శక్తిపీఠం: పట్టణంలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు. ప్రాతః కాలాన ఉదయం 5.30కి సుప్రభాతసేవ, ఆదిత్య హృదయ పారాయణం, మహాసౌరం అలాగే స్వామివారి మూల విగ్రహానికి విశేష అభిషేకాలు ఉంటాయని వివరించారు. ఉదయం 8 నుంచి లోక కల్యాణార్థం స్వామివారికి అర్కపత్రాలు, ఎర్రటి పుష్పాలతో లక్ష పుష్పార్చన, అనంతరం సూర్యప్రభ వాహనంలో స్వామివారి ఉత్సవమూర్తుల ఊరేగింపు ఉంటుందని చెప్పారు. మధ్యాహ్నం చక్కెర పొంగళి, మహా నివేదన, ప్రదోశ కాలంలో సామూహిక అర్చనలు, దర్బార్ సేవ, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ చేపట్టనున్నట్లు వివరించారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పురాతన ఆలయం..



పట్టణంలోని తుంగభద్రనది తీరాన ఉన్న సూర్యనారాయణస్వామి ఆలయం చాలా పురాతనమైంది, అరుదైన ఆలయం. కోణార్క్‌లోని సూర్యదేవాలయం తరహాలో ఇక్కడి గర్భాలయంలోని సూర్యభగవానుడి మూలవిరాట్‌పై సూర్యకిరణాలు పడుతుంటాయి. భక్తులు తప్పక దర్శించుకోవాల్సిన ఆలయం ఇది.

– పురేందర్‌కుమార్, ఆలయ ఈవో

ఆరోగ్య ప్రదాత..



ఈ ఆలయం ఎంతో పురాతనమైంది. గర్భాలయంలో కొలువుదీరిన స్వామి వారిని అభిషేకించి తీర్థం సేవించినా లేదా ఏడు వారాలు ఆదిత్య హృదయ పారాయణాలు చేసినా అనారోగ్య సమస్యలు తొలగుతాయని ప్రతీతి.

– దేవళ్ల పృథ్వీనాథ్‌శర్మ, ఆలయ అర్చకుడు

ప్రాచుర్యంలోకి తీసుకురావాలి.



ఎంతో చారిత్రక, మహిమాన్విత ఆలయం ఇది. ఇలాంటి ఆలయాన్ని భక్తులు దర్శించుకొనేలా పాలకమండలి సభ్యులు ప్రాచుర్యంలోకి తీసుకురావాలి. ఆలయం తెరిచి ఓ అర్చకుడిని ఏర్పాటు చేయాలి.

– మద్దిలేటి, భక్తుడు, అలంపూర్

బ్రహ్మోత్సవాల ఆదాయం రూ.6,69,316

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా అయిదు రోజులకుగాను ఆలయానికి రూ.6,69,316 ఆదాయం సమకూరినట్లు ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్యనాయుడు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు అమ్మవారి 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయన్నారు. వివిధ రకాల ఆర్జిత సేవల టికెట్ల ద్వారా రూ.1,69,316, నిజరూప దర్శనం రోజు రూ.2,66,746, బాలబ్రహ్మేశ్వర నిత్యాన్నదాన సత్రం ద్వారా 5 రోజుల్లో రూ.1,44,992 ఆదాయం వచ్చిందన్నారు. బ్రహ్మోత్సవాల విజయవంతానికి సహకరించిన ఈవో, ఆలయ అర్చక, ఉద్యోగులు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

కట్టుకున్న భార్యను కడతేర్చిన భర్త

- నాలుగు రోజులుగా ఇంట్లోనే మృతదేహం



ఇందిర (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: దుబారా ఖర్చులపై నిలదీసిన భార్యను కడతేర్చాడో భర్త. ఆపై ఆమె మృతదేహాన్ని ఇంట్లోనే ఉంచి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగుచూసింది. సీఐ కనకయ్యగౌడ్ వివరాల మేరకు.. జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో భార్యాభర్తలు ఇందిర (48), శ్రీనివాస్ నివాసముంటున్నారు. వీరి కూతురు అఖిలకు ఇటీవల వివాహం కాగా.. కల్యాణలక్ష్మి డబ్బులు వచ్చాయి. ఆ డబ్బులను తండ్రి శ్రీనివాస్ ఖర్చు చేయడంతో పాటు కొంత బంగారం తాకట్టు పెట్టాడు. ఈక్రమంలో దుబారా ఖర్చులపై ఇందిర, శ్రీనివాస్ మధ్య గొడవలు చోటుచేసుకుంటున్నాయి. ఆదివారం మరోసారి గొడవ జరగడంతో భార్య ఇందిరపై శ్రీనివాస్ గొడ్డలితో దాడిచేశాడు. ఆమెకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహాన్ని ఇంట్లోనే ఉంచి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈక్రమంలో కూతురు అఖిల తల్లికి నాలుగు రోజులుగా ఫోన్ చేస్తున్నప్పటికీ స్పందించకపోవడంతో అనుమానం వచ్చి, గురువారం హైదరాబాద్ నుంచి నాగర్‌కర్నూల్‌లోని ఇంటికి రావడంతో తల్లి హత్యకు గురైన విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ కనకయ్యగౌడ్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతురాలి కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువరైతు మృతి



మల్లికార్జున్ (ఫైల్)

గట్టు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అనుమానాస్పద స్థితిలో ఓ యువ రైతు మృతిచెందిన ఘటన మండలంలోని తుమ్మలచెరువులో గురువారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా.. తుమ్మలచెరువుకి చెందిన చిన్న అంపయ్య చిన్న కుమారుడు మల్లికార్జున్ (26) బుధవారం రాత్రి ఇంటి దగ్గర భోజనం చేసి వ్యవసాయ పొలానికి వెళ్లాడు. రోజులానే అక్కడే ఉన్న గుడిసెలో నిద్రించాడు. అయితే, గురువారం ఉదయం మల్లికార్జున్ వ్యవసాయ పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ దగ్గర పడి మృతి చెందిన విషయాన్ని చుట్టు పక్కల పొలాలకు చెందిన రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో గ్రామస్తులతో పాటుగా కుటుంబ సభ్యులు పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతుని తల్లి సువర్ణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సంఘటనతో ఆ కుటుంబంలో విషాదం అలుముకొంది.

అనుమానాలెన్నో..

ఇదిలాఉండగా, మల్లికార్జున్ మృతిపై పలు అనుమానాలు వ్యక్తమతున్నాయి. ఉద్దేశ పూర్వకంగానే హత్య చేసి విద్యుదాఘాతంతో చనిపోయినట్లు నమ్మించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పడేశారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. గుడిసెలో పడుకున్న వ్యక్తి కాళ్లకు చెప్పులు లేకుండా, అదికూడా మొబైల్ ఫోన్ బ్యాటరీ ఆన్ చేసుకోకుండా ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు ఎలా వెళ్తాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్



ఊరంచుతండాలో సేవాలాల్‌కు పూజలు చేస్తున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

నవాబుపేట: గిరిజనుల ఆరాధ్య దైవంగా సేవాలాల్ ప్రత్యేకత సంతరించుకున్నారని, ఆయన అడుగు జాడల్లో నడవాలని ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఊరంచు తండాలో సేవాలాల్ జయంతి కమిటీ చైర్మన్ లింభ్యా, రాములునాయక్, శంకర్‌నాయక్ అధ్యక్షతన జరిగిన సేవాలాల్ మహాభోగ్ బండార్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న గిరిజన తండాలను అప్పటి సీఎం కేసీఆర్ ప్రత్యేక పంచాయతీలు చేసి అభివృద్ధికి బాటలు వేశారని కొనియాడారు. గిరిజన తండాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. అనంతరం సేవాలాల్, భవాని మాతకు ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు అభిమన్యురెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నర్సింహులు, ఎంపీపీ అనంతయ్య, ఎల్‌హెచ్‌పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శంకర్, సేవాలాల్ ఉత్సవ సమితి నాయకులు చందర్‌నాయక్, శంకర్, రాములు, లింబ్యా, రాజు,సేవ్యా, రవి, గోపాల్‌గౌడ్, ప్రతాప్, తాహేర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు..



పీయూలో సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సంత్ సేవాలాల్ ఆదర్శప్రాయుడని పీయూ వైస్ చాన్స్‌లర్ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. ఈ మేరకు సేవాలాల్ జయంతిని పీయూలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి వీసీ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సేవాలాల్ ఒక్క బంజారా సమాజానికి కాకుండా.. యావత్ ప్రపంచానికి ఆరాధ్యుడు అన్నారు. అహింసా, మద్యపాన నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించి, హిందూధర్మం గొప్పతనాన్ని ప్రజలకు చాటిచెప్పారని, ఆయన బోధనలు విశ్వజనీతం అన్నారు. కార్యక్రమంలో వీసీ ఓఎస్‌డీ మధుసూదన్‌రెడ్డి, ఏఆర్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ రవీందర్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

జింకను చంపిన చిరుత?

ఖిల్లాఘనపురం: అడవి ప్రాంతంలో ఓ జింకను చిరుత చంపిన సంఘటన మండలంలోని పర్వతాపురంలో గురువారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పంతగాని శంకర్, మన్యం వ్యవసాయ పొలాలు గుట్టకు సమీపంలో ఉన్నాయి. ఈ పొలాల్లోని కుంట దగ్గర రెండు రోజుల క్రితం ఓ జింకను చిరుత వేటాడి చంపి కొంత భాగాన్ని వదిలి తలను తీసుకెళ్లింది. అయితే గురువారం దుర్వాసన రావడంతో అటుగా వెళ్లిన వారు గమనించారు. జింకను కచ్చితంగా చిరుత వేటాడి చంపి ఉంటుందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు

నవాబుపేట: స్థల సమస్యలపై మాట్లాడుదామని పిలిచి తనపై దాడి చేశారని మల్లారెడ్డిపల్లికి చెందిన జక్కుల జంగయ్య గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు.

నిర్వాసితులను ఆదుకోవాలి

జడ్చర్ల: పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతలలో భాగంగా నిర్మిస్తున్న ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులను ఆదుకోవాలని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి గురువారం అసెంబ్లీలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో చేపట్టిన ఈ పథకానికి సంబంధించి ఉదండాపూర్‌లో నిర్మిస్తున్న రిజర్వాయర్‌కు రైతుల నుంచి సేకరించిన భూములకు నామమాత్రంగా పరిహారం కేటాయించారన్నారు. పోలేపల్లి భూములకు ఎకరాకు రూ.12.50 లక్షలు ఇస్తే.. వల్లూరు, ఉదండాపూర్ రైతులకు రూ.5.50– 6.50 లక్షలు మాత్రమే ఇచ్చారని, అవార్డు పాసైనా ఇప్పటికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వలేదని ఆరోపించారు. ఉమ్మడి కుటుంబానికి రూ.25 లక్షలు, సింగిల్‌గా ఉన్నవారికి రూ.10 లక్షలు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, ఉదండాపూర్ రిజర్వాయర్ కుడి,ఎడమ కాల్వల పనులు చేపట్టాలని కోరారు. గత ప్రభుత్వం నార్లాపూర్‌లో 9 పంపు హౌజ్‌లకు గాను ఒక్క దానిని ప్రారంభించి కేవలం 3 గంటలు నడిపి మమ అనిపించారని విమర్శించారు. ఇక అవినీతి సైతం తారస్థాయిలో జరిగిందని, ప్రభుత్వ భూములకు సైతం అప్పటి అధికార పార్టీ నాయకులు పరిహారం పొందారని ఆరోపించారు. కె.మంగ, కె.రవి పేర్ల మీద రూ.1.50 కోట్లు అక్రమంగా పరిహారం అందుకున్నారని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన సభ దృష్టికి తెచ్చారు.

టీటీడీ ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు

స్టేషన్ మహబూబ్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉమ్మడి జిల్లాలోని ఐదు ప్రాంతాల్లో రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సమన్వయకర్త ఉత్తరపల్లి రామాచారి గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రం వెంకటేశ్వరకాలనీలోని గెలాక్సీ పాఠశాలలో, కల్వకుర్తిలోని శ్రీసరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో, వనపర్తి జిల్లా చిన్నమందడి జెడ్పీహెచ్‌ఎస్‌లో, గద్వాల జిల్లాకేంద్రంలోని శ్రీనివాస కాన్సెప్ట్ స్కూల్‌లో, నారాయణపేటలోని లిటిల్ స్కాలర్ స్కూల్‌లో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు వేడుకలు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులచే సూర్యనమస్కారాలు, ఆదిత్య హృదయ పఠనం, అన్నమాచార్య సంకీర్తనలు, రథసప్తమి విశిష్టత ప్రవచనం ఉంటుందని తెలిపారు.

ఊరంతా పండగ

- లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలతో గంగాపూర్‌కు పెరుగుతున్న రద్దీ
- బంధువుల రాకతో ఇళ్లన్నీ కళకళ
- వైభవంగా పుష్పరథోత్సవం
- నేడు రథసప్తమిని పురస్కరించుకొని పెద్దతేరు




ఆలయం వద్ద బస చేస్తున్న భక్తులు

జడ్చర్ల టౌన్: కులమతాలకు అతీతంగా జడ్చర్ల మండలం గంగాపూర్‌లో సందడి నెలకొంది. ప్రతి ఇంట్లో బంధువుల రాకతో లోగిళ్లన్నీ కళకళలాడుతున్నాయి. వీధుల్లో దుకాణాలు వెలువడడం.. ముఖ్య కూడళ్లన్నీ విద్యుద్దీపాల అలంకరణలు చేయడంతో వెలుగులు విరజిమ్ముతున్నాయి. ప్రతి ఏటా మాఘ శుద్ధ పాడ్యమి మొదలు నవమి వరకు లక్ష్మీచెన్నకేశవస్వామికి నిర్వహించే బ్రహ్మోత్సవాలతో గ్రామం అంతా పండగ వాతావరణం నెలకొంది. బతుకుదెరువు, ఉద్యోగాలు, చదువు నిమిత్తం ఆయా ప్రాంతాలకు వెళ్లిన వారంతా ఊరికి వచ్చేశారు. ఆడపడుచులు, కొత్త అల్లుళ్లు, వియ్యంకులతో అన్ని లోగిళ్లు కిటకిటలాడుతున్నాయి. ప్రధాన రోడ్లకిరువైపులా మిఠాయిలు, తినుబండారాలు, పిల్లల ఆటవస్తువులు, గాజులు, అలంకరణ సామగ్రి దుకాణాలు వెలిశాయి. గ్రామం చివరన చిన్నారులు ఆటలాడుకునే రంగులరాట్నం తదితర బండ్లు నెలకొల్పారు. భక్తులు మొదట స్వామివారిని దర్శించుకొని అనంతరం జాతరలో ఉత్సాహంగా గడుపుతున్నారు. ఇదిలాఉండగా, రథసప్తమి శుక్రవారం కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు చాలా మంది భక్తులు ఆలయ ప్రాంగణంలోని చలువ పందిళ్లలో సేద తీరారు.

నేడు రథోత్సవం

ఉత్సవాల్లో భాగంగా రథసప్తమి పురస్కరించుకొని శుక్రవారం రాత్రి స్వామికి పెద్దతేరు (రథోత్సవం) నిర్వహించనున్నారు. రథోత్సవానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, హైదరాబాద్ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.

కనులపండువగా పుష్పరథోత్సవం



ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి పుష్పరథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ రాజగోపురం ఎదురుగా చిన్నతేరును ఉంచి బలిహరణం చేశారు. రథాన్ని పుష్పాలతో అలంకరించి హోమం జరిపించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణలతో రథానికి పూజలు చేసి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉత్సవ విగ్రహాలకు పూజలు చేసిన పండితులు రథాన్ని ముందుకు కదిలించారు. అనంతరం భక్తుల భక్తుల చెన్నకేశవ, గోవింద నామస్మరణల మధ్య పుష్పరథం కనులపండువలా గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేశారు. అర్ధరాత్రి వరకు ఊరేగింపు కొనసాగింది. పుష్ప రథోత్సవం పురస్కరించుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైభవంగా గట్టుతిమ్మప్ప ప్రభోత్సవం

మక్తల్: పేదల తిరుమల తిరుపతిగా పేరుగాంచిన మండలంలోని మాద్వార్ గట్టుతిమ్మప్పస్వామి ప్రభోత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం సాయంత్రం స్వామి వారిని కొండపైకి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఇదిలా ఉండగా, సంగంబండకి చెందిన నాగప్ప కుమారులు స్వామివారి ఉద్దాలను భారీ ఊరేగింపు నడుమ ఆలయం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు, భక్తులు పాల్గొన్నారు.



మాద్వార్‌లో ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు

నేడు రథోత్సవం

మాద్వార్ గట్టుతిమ్మప్పస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 11గంటలకు కల్యాణోత్సవం, సాయంత్రం 6గంటలకు స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నారు. అలాగే, 17న పాల ఉట్లు, 18న గరుడవాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పీయూలో లా, ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేయాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీయూ అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో లా, ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ వాల్‌పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఉమ్మడి పాలమూరు జిల్లా విద్య పరంగా చాలా వెనుకబడి ఉందని, పీయూ ఏర్పాటు నుంచి నిధుల సమస్యలతో కొట్టుమిట్టాడుతుందని, సాధారణ కోర్సులకే పరిమితమైందన్నారు. లా, ఇంజినీరింగ్ విద్యను పాలమూరు విద్యార్థులకు అందించాలంటే ఇక్కడ తప్పక సదరు కళాశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఇంజినీరింగ్ కళాశాల మంజూరైందని, దాన్ని పీయూలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 17న నల్లబ్యాడ్జీలతో నిరసన, 20న అధ్యాపక, విద్యార్థులతో చర్చా కార్యక్రమం, 21న నిరసన ర్యాలీ, 23న నిరాహార దీక్ష, 24న యూనివర్సిటీ బంద్ వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వాల్‌పోస్టర్ల విడుదల కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, పొలిటిల్ సైన్స్ హెచ్‌ఓడీ కుమారస్వామి, భూమయ్య, విజయ్‌భాస్కర్, గాలెన్న, రంగప్ప, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకే టికెట్లు ఇవ్వాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని ప్రధాన పార్టీలు బీసీ అభ్యర్థులకు మాత్రమే టికెట్లు ఇవ్వాలని బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యారావు అన్నారు. శుక్రవారం స్థానిక టీఎన్‌జీఓ భవన్‌లో బీసీ సమాజ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ కుల సంఘాలతో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు టిక్కెట్లు కేటాయించని పక్షంలో బీసీల ఆగ్రహానికి పార్టీలు గురికాక తప్పదని హెచ్చరించారు. ఇంకా ఎన్ని రోజులు అగ్రవర్ణాల చెప్పుచేతుల్లో బతకాలని ప్రశ్నించారు. రాజ్యాధికారమే ధ్యేయంగా బీసీలు ముందుకు కదలాలని అన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో 60 నుంచి 65 శాతం ఉన్న బీసీ జనాభా ఉందని, విషయాన్ని ప్రతి పార్టీ గుర్తుంచుకోవాలని, ఈ ఎన్నికల్లో అగ్రవర్ణాలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ సీఎం అని ప్రకటించిన బీజేపీ పార్టీ ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీసీకి టికెట్ ఇవ్వాల, చట్టసభల్లో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సమాజ్ నాయకులు సత్యం, ఆర్, సత్యం, శేఖర్, లక్ష్మన్‌గౌడ్, గంజి ఆంజనేయులు, అనిల్, ప్రణీల్, గోపి, నారాయణయాదవ్, హనుమంతు, రాము లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed (TTC), B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM 3 నెలల్లో కోర్స్ పూర్తిచేసే అవకాశం. ఫోన్: 8868877112,339.

WANTED
■ డైరెక్ట్ జాబ్ 18-30 సం॥ మహిళలు / పురుషులు మా కంపెనీ కొరకు వెంటనే కావలెను. ఫ్రీ రూం+భోజనం+డ్రైవర్లు+మార్కెటింగ్ స్టాఫ్ కావలెను. జీతం 20,000/-. ఫోన్: 8886733005.



గమనిక

... - సాక్షి మేనేజర్